## క్లుప్తంగా

### వైద్యుడు రాంబాబు నాయక్‌కు సత్కారం



రాంబాబు నాయక్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ శ్రీలత తదితరులు

**కిర్లంపూడి:** సర్వీస్ కోటాలో పీజీకి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ రాంబాబు నాయక్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత ఆధ్వర్యంలో ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించారు. వీరితో పాటు, పీహెచ్‌సీ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. సర్పంచ్ శ్రీలత మాట్లాడుతూ, ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించిన రాంబాబు నాయక్ ఉన్నత విద్యకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

### దగ్గుపై అలసత్వం తగదు

**ప్రత్తిపాడు:** తరచూ వస్తున్న దగ్గుపై అలసత్వం వహించరాదని ప్రత్తిపాడు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ బి.సౌమ్య మైఖేల్ అన్నారు. స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం టీబీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ధారాళంగా దగ్గు వచ్చినా, రెండు వారాలకు మించి దగ్గు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. రెండు వారాలకు మించి జ్వరంతో ఉండడం, బరువు తగ్గినా, దగ్గినపుడు రక్తం పడినా క్షయ వ్యాధి కావచ్చన్నారు. ఆయా లక్షణాలున్న వారు వెంటనే ఆస్పత్రికి వెళ్లాలన్నారు. టీబీ సోకితే కనీసం 9 నెలల పాటు మందులు సక్రమంగా వాడాలని చెప్పారు. టీబీ అధికారి అనిల్‌కుమార్, సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### కష్టాల్లో మహిళా మార్ట్

**కిర్లంపూడి:** మహిళల ఆర్థికాభివృద్ధికి నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కిర్లంపూడిలో పొదుపు సంఘాల మహిళలను భాగస్వాములను చేస్తూ మార్టును ప్రారంభించింది. రోజుకు సుమారు రూ.లక్షకు పైగా వ్యాపారం జరిగేది. ఎన్నికల అనంతరం దీని నిర్వహణను విస్మరించడంతో రోజుకు రూ.2 వేలకు దిగజారింది. మంగళవారం మార్ట్‌డీపీఎం వెంకటేశ్వరరావు మార్ట్‌కు సంబంధించి ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్ట్‌లో సేల్స్ పెంచేందుకు సిబ్బందికి సలహాలు ఇచ్చామన్నారు. మార్టులో విక్రయాల సొమ్ము సుమారు రూ.6.53 లక్షలు వీఓఏల వద్ద ఉండిపోయాయన్నారు. వాటిని త్వరలో రికవరీ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న శ్రీనిధి బకాయిలను త్వరితగతిన రికవరీ చేయాలని స్త్రీనిధి సిబ్బంది వీఓఏలను ఆదేశించారు. ఆయన వెంట ఏపీఎం ఎస్.వేదకుమారి, శ్రీనివాస్, ఏజీఎంలు, సీసీలు ఉన్నారు.

### రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**గోకవరం:** సొంత పొలం ఉన్న రైతులు అగ్రిస్టాక్ పోర్టల్‌లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎంఏఓ రాజరాజేశ్వరి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఏఓ పరిశీలించారు. రీసర్వే పూర్తి కాని గ్రామాల్లో మూడు రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ఉందన్నారు.

### అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత



పట్టుబడిన వ్యాన్‌లో ఉన్న గోవులు

**గండేపల్లి:** ఓ వ్యాన్‌లో అక్రమంగా గోవులను తరలిస్తుండగా గండేపల్లి పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. పోలీసుల వివరాల మేరకు, విశాఖపట్నం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు గోవులతో వెళుతున్న వ్యాన్‌ను రామవరానికి చెందిన మేక వీరబాబు గుర్తించాడు. శ్రీకాకుళం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న ఈ వ్యాన్‌కు అడుగు భాగంలోను, పైభాగంలోనూ చిన్నా పెద్దా కలిపి సుమారు వంద వరకు గోవులు ఉన్నాయి. ఈ వాహనాన్ని జగ్గంపేటలో అడ్డుకునేందుకు యత్నించగా, డ్రైవర్ వాహనంతో తప్పించుకున్నాడు. జెడ్.రాగంపేటలో గ్రామస్తుల సాయంతో వాహనాన్ని అడ్డుకుని పోలీసులకు అప్పగించినట్టు వీరబాబు తెలిపాడు. ఈ గోవులను గోకవరం మండలం కృష్ణునిపాలెంలో ఉన్న గోశాలకు తరలించి, కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపారు.

### మృతదేహంతో ఆందోళన



కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు

**ఏలేశ్వరం:** మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ పెద్దనాపల్లి గ్రామంలో మంగళవారం బంధువులు ఆందోళన చేపట్టారు. స్థానిక ప్రైవేటు కంపెనీ వద్ద మృతదేహంతో ధర్నా చేశారు. వారి వివరాల మేరకు, పెద్దనాపల్లి గ్రామానికి చెందిన మోర్త సుదర్శనరావు(20) కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని అతని భార్య స్రవంతితో పాటు, బంధువులు అతడు పనిచేసే కంపెనీ వద్ద ఆందోళన చేశారు.

# క్షణం క్షణం.. భయం భయం

- తునిలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికను అడ్డుకున్న టీడీపీ
- జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- కౌన్సిలర్లను పరుగెత్తించిన టీడీపీ శ్రేణులు
- కోరం లేకపోవడంతో మళ్లీ వాయిదా
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారన్న ప్రజలు



తుని మండలం వెలంపేట వై.జంక్షన్‌లో వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్న పోలీసులు

**తుని:** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఉన్న గౌరవాన్ని అధికార మదంతో టీడీపీ అపహాస్యం చేసింది. చిన్నపాటి మున్సిపల్ వైస్ చైర్మన్ కోసం గలాటా సృష్టించి ప్రజలను భయాందోళనకు గురి చేసింది. క్షణ క్షణం.. టెన్షన్‌తో తుని పట్టణంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పల్నాడు, రాయలసీమలో ఇటువంటి సంఘటనలు సర్వసాధారణం. ప్రశాంతతకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న తునిలో యుద్ధ వాతావరణం నెలకొనడంతో.. ఎప్పుడు, ఏం జరుగుతుందోనని ప్రజలు ఉత్కంఠతకు లోనయ్యారు. మంగళవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు టెన్షన్ నెలకొంది. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ హాలులోకి వెళ్లకపోవడంతో, కోరం లేదని ఎన్నికల అధికారి, డీపీవో రవికుమార్ ఎన్నికను వాయిదా వేసినట్టు ప్రకటించారు. తదుపరి చర్యల కోసం నివేదికను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి నివేదిక పంపారు.

**పోలీసుల వలయంలో..**

మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికను పురస్కరించుకొని మున్సిపల్ కార్యాలయం పోలీసుల వలయంలో ఉంది. ఎన్నికల అధికారి జారీ చేసిన నోటీస్ ప్రకారం ఉదయం 11 గంటలకు కౌన్సిలర్లు కౌన్సిల్ హాలులోకి చేరాలి. 11 నుంచి 12 గంటల మధ్యలో వైస్ చైర్మన్ ఎన్నిక చేతులెత్తే పద్ధతిలో జరగాల్సి ఉంది. ఉదయం 9 గంటలకే టీడీపీ, వైఎస్సార్ సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా అక్కడకు చేరుకున్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా సోమవారం చలో తునికి పిలుపునిచ్చారు. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు వస్తారని గ్రహించిన పోలీసులు ఎక్కడికక్కడ పోలీస్ అవుట్ పోస్టులు పెట్టి వారిని అడ్డుకున్నారు. దీంతో మున్సిపల్ **కార్యాలయం ఉన్న మెయిన్ రోడ్డు, పోస్టాఫీసు వీధిలోకి పార్టీల కార్యకర్తలను పోలీసులు అనుమతించారు. వైఎస్సార్ సీపీకి చెందిన సానుభూతిపరులను మున్సిపల్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో ఆపివేశారు. టీడీపీ కార్యకర్తలను మున్సిపల్ కార్యాలయం చేరువలోకి అనుమతించారు.** మున్సిపల్ చైర్‌పర్సన్ నివాసంలో ఉన్న వైఎస్సార్ సీపీకి చెందిన 17 మంది కౌన్సిలర్లను ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఓటింగ్‌కు రావాలని కోరారు. దీంతో వైఎస్సార్ సీపీకి చెందిన 17 మంది మున్సిపల్ కార్యాలయానికి బయలుదేరారు. మున్సిపల్ కార్యాలయం గేటు సమీపంలోకి చేరుకున్న సమయంలో టీడీపీ శ్రేణులు పోలీస్ బారికేడ్లను తోసివేసి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లపై దాడికి దిగారు. అప్రమత్తమైన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పరుగున మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంటికి చేరుకున్నారు. దీంతో వైఎస్సార్ సీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టారు.

**బలం.. బలగం**

వైఎస్సార్ సీపీ 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 30కి 30 స్థానాలను కైవసం చేసుకుంది. చైర్మన్‌గా ఏలూరి సుధారాణి, వైస్ చైర్మన్‌గా కుచ్చర్లపాటి రూపాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అప్పటి ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక సంస్థలకు రెండో వైస్ చైర్మన్ పదవిని కల్పించారు. దీంతో వైఎస్సార్ సీపీకి 21వ వార్డు కౌన్సిలర్ పామర్తి మహేష్‌ను వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. రెండున్నరేళ్ల తర్వాత రాజీనామా చేయాలని జెంటిల్‌మన్ ఒప్పందం చేసుకున్నారు. దీంతో వైస్ చైర్మన్ పదవికి మహేష్ రాజీనామా చేయడంతో, ఉప ఎన్నికకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 3న ఎన్నిక జరగాల్సి ఉన్నా, టీడీపీ శ్రేణులు కౌన్సిల్ హాలులోకి దౌర్జన్యంగా ప్రవేశించి, ఎన్నికను అడ్డుకోవడంతో వాయిదా పడింది. మరుసటి రోజూ ఇదే పరిస్థితి పునరావృతం కావడంతో ఆర్వో వాయిదా వేశారు. దీనిపై వైఎస్సార్ సీపీకి చెందిన మహిళా కౌన్సిలర్ కాసే సుమతి హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు సోమవారం ఎన్నిక జరిపించేందుకు ఏర్పాట్లు చేసినా, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు రాకుండా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. దీంతో మంగళవారానికి వాయిదా పడిన వైస్ చైర్మన్ ఎన్నిక.. మళ్లీ వాయిదా పడింది. ఎన్నిక నిర్వహణ విషయంలో అధికారులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.

### టీడీపీ జీరోతో పోటీ

**టీడీపీకి కౌన్సిల్‌లో ఒక్క సీటు లేదు. వైఎస్సార్ సీపీకి 27 మంది సభ్యులు ఉన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికను జరగకుండా అడ్డుకుంటే వైఎస్సార్ సీపీకి చెందిన కొంత మం**దిని బలవంతంగా చేర్చుకోవచ్చని పథకం రచించారు. అందులో భాగంగా ఈ నెల 3, 4 తేదీల్లో జరగాల్సిన వైస్ చైర్మన్ ఎన్నికకు ముగ్గురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. ఈ సంఖ్యను సోమవారం నాటికి 10కి పెంచుకున్నారు. వైఎస్సార్ సీపీకి ఇంకా 18 మంది ఉన్నారు. ఎన్నిక నిర్వహణకు కోరం ఉండాలంటే 16 మంది కౌన్సిలర్లు ఉండాలి. ఉన్న 10 మందితో వెళితే ఓటమి తప్పదని గ్రహించి వాయిదా డ్రామాకు తెరలేపారు. నాలుగు సార్లు వాయిదా పడిన తర్వాత మరి కొందరిని బలవంతంగా చేర్చుకుని బలం పెంచుకునేందుకు ఆడిన డ్రామాకు అధికారులు పూర్తి స్థాయిలో సహకరించారని పలువురు చర్చించుకుంటున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కోసం ఇంతటి గలాటా సృష్టించడంపై ప్రజాస్వామ్య వాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అర్ధ రాత్రి హౌస్ అరెస్టులు

**కోటనందూరు:** తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులను పోలీసులు హౌస్ అరెస్టులు చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు వెలగా వెంకటకృష్ణాజీ, గరిసింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, భీమవరపుకోట సర్పంచ్ జిగటాల వీరబాబు తదితరులకు సోమవారం అర్ధ రాత్రి ఒంటి గంట సమయంలో వారి ఇళ్లకు వెళ్లి హౌస్ అరెస్టు చేస్తున్నట్టు పోలీసులు నోటీసులు ఇచ్చారు. మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక జరిగే సమయంలో తుని వెళ్లకూడదని హుకుం జారీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ, తాము అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు, తమపై రౌడీషీట్లు ఉన్నట్లు పోలీసులు అర్ధరాత్రి వచ్చి నోటీసులు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. కూటమి నేతల దౌర్జన్యాలకు ఈ అరెస్టులు పరాకాష్ట అని మండిపడ్డారు.



కోటనందూరులో వైఎస్సార్ సీపీ నాయకుడు గరిసింగు దొరబాబుకు నోటీసు ఇస్తున్న కానిస్టేబుల్

# అడుగడుగునా ఆంక్షలు

- ప్రధాన రహదారుల్లో పోలీసుల విస్తృత తనిఖీలు
- వైఎస్సార్ సీపీ నాయకులను అడ్డగించిన వైనం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పిలుపుతో 'చలో తుని'కి భారీగా తరలివచ్చిన శ్రేణులు



మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణిని కలిసేందుకు వచ్చిన మాజీ ఎంపీ వంగా గీత, పార్టీ శ్రేణులు

**తుని రూరల్:** వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఇచ్చిన 'చలో తుని' పిలుపుతో తుని పట్టణానికి చేరుకునే ప్రధాన రహదారుల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. చలో తుని కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చే నాయకులు, కార్యకర్తల వాహనాలను పోలీసులు అడ్డుకున్నారు. తుని పురపాలక సంఘంలో వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను టీడీపీ, కూటమి నాయకులు అడ్డుకోవడాన్ని వ్యతిరేకిస్తూ దాడిశెట్టి రాజా చలో తుని పిలుపునిచ్చారు. దీంతో మంగళవారం విస్తృత తనిఖీల్లో భాగంగా వెలంపేట కాలనీ, నర్సీపట్నం రోడ్డు, రైల్వే అండర్‌పాస్ వద్ద పోలీసులు ముమ్మర తనిఖీలు చేశారు. పట్టణంలోకి ప్రవేశించే వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను అడ్డుకున్నారు. వెలంపేట వై.జంక్షన్‌లో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, మురళీరాజు తదితర నేతలను అడ్డుకున్నారు. వాహనాలను ముందుకు వెళ్లనీయకుండా, వారి స్వగ్రామాలకు పంపించివేశారు. మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు ఆంక్షలను ఎదుర్కొని ద్విచక్ర వాహనాలపై జగన్నాథగిరి మీదుగా రైల్వే అండర్‌పాస్ నుంచి తుని పట్టణంలో ప్రవేశించారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా వద్దకు చేరుకుని మద్దతుగా నిలిచారు. పోలీసులు ప్రతి వాహనాన్ని అణువణువూ తనిఖీలు చేయడంతో సాధారణ ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోలీసుల తనిఖీలు కొనసాగాయి. మధ్యాహ్నం 12 గంటల తర్వాత మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నాలుగోసారి వాయిదా వేయడంతో వాహనాల తనిఖీలను నిలిపివేశారు.

**తునికి తరలివెళ్లిన శ్రేణులు**

**రౌతులపూడి:** తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఉప ఎన్నిక సందర్భంగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఇచ్చిన చలో తుని పిలుపు మేరకు మంగళవారం పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆదేశాలతో మండలంలోని 26 పంచాయతీల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రం నుంచి బయలుదేరి తేటగుంట మీదుగా తుని తరలివెళ్లి తమ సంఘీభావం తెలిపారు.



పోలీసులు అడ్డుకోవడంతో ముందుకు వెళ్లలేకపోయిన తోట నరసింహం, నేతలు

# ప్రజలు అంతా గమనిస్తున్నారు

### మాజీ మంత్రి తోట నరసింహం

**జగ్గంపేట:** తునిలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంపికలో నెలకొంటున్న పరిణామాల నేపథ్యంలో చలో తుని కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం దారుణమని మాజీ మంత్రి, పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. ఆయన ఫోన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు తమ శ్రేణులకు మద్దతుగా జగ్గంపేట నుంచి తుని బయలుదేరామని చెప్పారు. తమను తుని రైల్వే గేట్ వద్ద పోలీసులు నిలిపివేశారని, వారితో వాగ్వాదం జరిగిందన్నారు. పోలీసులు తమను ముందుకు వెళ్లనీయకుండా, వెనక్కి పంపేశారని చెప్పారు. కూటమి దుష్ట పాలన అంతా ప్రజలు గమనిస్తున్నారని, వారికి మున్సిపాలిటీలో బలం లేకపోయినా వైస్ చైర్మన్ పదవి కోసం కూటమి నేతలు అరాచకాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట తోట రాంజీతో పాటు, నియోజకవర్గానికి చెందిన నేతలు ఉన్నారు.

# అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీడీపీఓ పద్మావతి

**రౌతులపూడి:** స్లాట్ (సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్) కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్ (జ్ఞాన జ్యోతి)పై నిర్వహిస్తున్న ఆరు రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఈ కార్యక్రమాన్ని శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ టీడీఆర్ పద్మావతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంగన్‌వాడీల్లో ప్రారంభ తరగతుల్లో ఆటల ఆధారిత అభ్యసన, పిల్లల అభ్యసనలో తల్లిదండ్రులు, సమాజ భాగస్వామ్యం, అంగన్‌వాడీ టీచర్ల అసైన్మెంట్, సమ్మిళిత విద్యా విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా బలోపేతం చేయటమే ఈ కార్యక్రమం ఉద్దేశమని సీడీపీఓ పద్మావతి అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కోళ్ల రాంబాబు, ఐసీడీఎస్ మండల విస్తరణాధికారి జానకీలక్ష్మి, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి శిక్షణ**

**కిర్లంపూడి:** అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలను మరింత సమర్థంగా అమలు చేసేందుకు శిక్షణ తరగతులు దోహదపడతాయని జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ అన్నారు. స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో ఎంఈఓలు టి.జోషఫ్, ఎం.చిన్నారావు అధ్యక్షతన పోషణ్ భీ, పఢాయి భీపై మండలంలోని 87 అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ, ప్రారంభ ప్రేరణ, ప్రారంభ బాల్య సంరక్షణ విద్య, పాఠ్యాంశాల బోధన విధానాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రీ స్కూల్ చిన్నారుల్లో సామర్థ్యాలు పెంపొందించేందుకు అవసరమైన మెళకువలను అందిపుచ్చుకోవచ్చని చెప్పారు. శారీరక, మానసిక, సాంఘీక, భాష, గణిత, సృజనాత్మకత వంటి ఆరు రకాల డొమైన్లను అమలు చేసి, చిన్నారుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. డీఆర్పీలు పి.భూసమ్మ, కరీమున్నీసా పాల్గొన్నారు.

**ప్రత్తిపాడు రూరల్:** ప్రీ స్కూళ్లను బలోపేతం చేయడమే లక్ష్యంగా అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ అన్నారు. మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ సిబ్బందికి ఆరు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ వి.రాజబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్ వరలక్ష్మి, జి.చక్రవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేపు విద్యుత్ మీటర్ రీడర్ల మహాసభ



ప్రత్తిపాడులో ఏఈ కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**ప్రత్తిపాడు:** రాష్ట్రంలోని విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మహాసభ నిర్వహిస్తున్నట్టు ఏపీ విద్యుత్ మీటర్ రీడర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు చిందాడ ప్రకాశరావు(బాబీ) తెలిపారు. స్థానిక సబ్ స్టేషన్ ఆవరణలో ఏపీఈపీడీసీఎల్ ఏఈ కార్యాలయం వద్ద మంగళవారం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మీటర్ రీడర్లు ఎన్నో ఏళ్లుగా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు పసగడుగుల నానాజీ, శ్రీను, పసగడుగుల నూకరాజు, ఏసుబాబు, వినోద్, శ్రీను, తమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

**ఏలేశ్వరం:** తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పట్టణంలో విద్యుత్ మీటర్ల రీడర్లు ఆందోళన చేశారు. స్థానిక ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద పోస్టర్లతో నిరసన తెలిపారు. ప్రీపెయిడ్ మీటర్లతో తాము ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. మీటర్ల రీడింగ్‌తో జీవనం సాగిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉగ్గిన సతీష్, బీర శ్రీను, పైల చిన్ని, ఆలీషా తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

### ఆర్డీఓ శ్రీరమణి



రాజవరం సచివాలయంలో రీ సర్వే రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ

**రౌతులపూడి:** మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి అన్నారు. మండలంలోని ఆర్.వెంకటాపురంలో జరుగుతున్న రీ సర్వే పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా భూముల రీ సర్వేకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మిగిలి ఉన్న భూముల రీ సర్వే వివరాలపై స్థానిక విలేజ్ సర్వేయర్ కేశవరావును ఆరా తీశారు. ప్రమాణాలకు అనుగుణంగా సర్వే బృందాలు పని చేయాలని ఆదేశించారు. గ్రామాల్లోని రైతుల నుంచి వచ్చిన అభిప్రాయాలు, ప్రతి భూ హక్కుదారుని కచ్చితమైన భూముల వివరాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ నరేష్, వీఆర్ఓ గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

# ఎస్సీ వర్గీకరణ అంశంపై తీరు మార్చుకోవాలి


**రౌతులపూడి:** కీలకమైన ఎస్సీ వర్గీకరణ అంశంలో తెలుగు రాష్ట్రాల్లోని చంద్రబాబు, రేవంత్ సర్కార్లు తీరుమార్చుకోవాలని రాక్స్ జాతీయ అధ్యక్షుడు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రత్నాకర్ అన్నారు. మంగళవారం రౌతులపూడిలో పర్యటించిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అనేది దేశ వ్యాప్తంగా ఉన్న ఎస్సీల ఐక్యతపై జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. ఎస్సీ కులాల జాబితాలో ఉన్న కులాలకు న్యాయం చేసే ప్రక్రియ కాదన్నారు. ఎస్సీల జాబితాలో దేశవ్యాప్తంగా 1,108 కులాలు, తెలుగు రాష్ట్రాల్లో 59 కులాలున్నాయన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ వల్ల కేవలం ఆయా కులాలకు మూడు శాతం మాత్రమే మేలు కలుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును గౌరవిస్తూనే, ఎస్సీ జాబితాలో ఉన్న అన్ని కులాలకు న్యాయం జరిగేందుకు వ్యతిరేకించడం తప్పదన్నారు.

### వీఓఏలతో సమావేశం

**గండేపల్లి:** మహిళా సమాఖ్య సమావేశం మంగళవారం స్థానిక ఎంఎస్ భవనంలో నిర్వహించినట్టు ఏపీఎం సన్యాసిరావు తెలిపారు. ఈ సమావేశంలో స్త్రీనిధి, ఉన్నతి, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ రికవరీ, సంఘాలకు రుణాలు, ఎస్‌హెచ్‌జీ ఇన్‌కం సర్వే, లోకోస్ ప్రొఫైల్ సర్వే, విలేజ్ పావెర్టీ రిడక్షన్ ప్లాన్ సర్వే, మహిళా రైతు ఉత్పాదక సంఘాల బలోపేతం, స్వచ్ఛ ఆంధ్ర, బాల్య వివాహాల నిర్మూలన, మహిళలపై దాడులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

# రూ.14.96 కోట్ల పనుల సోషల్ ఆడిట్‌కు ఏర్పాట్లు

### నేడు కో–ఆర్డినేషన్ సమావేశం



సోషల్ ఆడిట్‌కు రికార్డులు సిద్ధం చేస్తున్న ఏపీఓ, ఈసీలు

**తుని రూరల్:** మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రూ.14.96 కోట్ల పనులకు సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని పథకం ఏపీఓ పి.నారాయణరావు తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ, 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు చేసిన పనులకు సోషల్ ఆడిట్ జరగనుందన్నారు. రూ.12.55 కోట్లను కూలీలకు, రూ.2.41 కోట్లను మెటీరియల్‌కు ఖర్చు చేసినట్టు తెలిపారు. సోషల్ ఆడిట్‌కు అవసరమైన రికార్డులను సిద్ధం చేశామన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో స్టేట్ రిసోర్స్ పర్సన్లు, జిల్లా రిసోర్స్ పర్సన్లు, అధికారులు, కార్యదర్శులతో కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం క్షేత్ర స్థాయిలో సోషల్ ఆడిట్ నిర్వహణ షెడ్యూల్‌ను ప్రకటిస్తామన్నారు. పంచాయతీల వారీగా గ్రామ సభల తర్వాత మండల స్థాయిలో సోషల్ ఆడిట్ నివేదిక వెల్లడిస్తామన్నారు.

### నలుగురు జూదరుల అరెస్టు

**ఏలేశ్వరం:** యర్రవరం గ్రామంలో మంగళవారం పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. తమకు అందిన సమాచారంతో పోలీసులు ఈ దాడి చేశారు. నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.32,750 నగదు స్వాధీనం చేసుకున్నారు.

### రుణాల రికవరీపై దృష్టి సారించాలి



తొండంగిలో వీవోఏలతో సమీక్షిస్తున్న శ్రీనివాసరావు

**తొండంగి:** డ్వాక్రా సంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా ఇచ్చిన రుణాలకు సంబంధించి రికవరీపై దృష్టి సారించాలని వీఓఏలను డీఆర్‌డీఏ పీడీ ఎ.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల స్త్రీ శక్తి భవన్‌లో వెలుగు వీవోఏలతో సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్, హౌసింగ్ రుణాల మంజూరు, రుణాల రికవరీ తదితర అంశాలపై సమీక్షించారు. ఆర్థిక సంవత్సరం పూర్తి కావస్తున్న నేపథ్యంలో రుణాల రికవరీపై దృష్టి పెట్టాలన్నారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వై.సత్తిబాబు, మండల మహిళా సమాఖ్య సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

**గోకవరం:** ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని రాజమహేంద్రవరం డీఎల్పీఓ నాగలత పంచాయతీ, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పన్నుల వసూళ్లు ఎంత వరకు వచ్చాయన్న విషయాన్ని పంచాయతీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరు నాటికి నూరుశాతం ఇంటి పన్నులను వసూలు చేయాలన్నారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, కార్యదర్శి గోపన్న, సచివాలయ సిబ్బంది ఉన్నారు.